# తీపి జబ్బు చేదు శిక్ష

**- కన్నెపల్లి చలమయ్య శాస్త్రి**

ఆరునెలలుగా సుందర్రాజుగారికి ఒంట్లో నలతగా ఉంది.

ఫ్యామిలీ డాక్టరు పరీక్ష చేసి చెప్పాడు ''పైలోనిడల్ సైనస్'' దాని పేరు.

వెన్నెముక చివర పూసల్లోంచి వెలువడ్డ నరం చివరేదో కుళ్ళిపోయిందట. శస్త్ర చికిత్స మినహా వేరు మార్గం లేదు. అయితే, ఆ నరంవెన్ను ఎముక్కి దగ్గర్లో ఉండడం చేత ఆపరేషన్ అంత సులభమైనది కాదట.

సుందర్రాజుగారు సర్జన్ని కలిసారు. కోసిపారెయ్యమని చెప్పారు. రక్తపరీక్ష కానిదే ఆపరేషన్ వీలుకాదన్నాడు సర్జన్. రక్త పరీక్ష చేయించుకున్నాక అసలు విషయం తెలిసింది. రాజుగారి రక్తంలో షుగర్ చాలా ఉంది.

''షుగర్ తగ్గితే బహుశా కోత అవసరం ఉండదు. అంచేత, ఈరోజు నుండి మీరు దుంపకూరలు, తీపి పదార్ధాలు మానేయాలి. అన్నం కూడా మితంగానే తినాలి. అదీ ఏకభుక్తమే. రోజూ కనీసం మూడు కిలోమీటర్లైనా నడక కావాలి. మధుమేహం శరీరంలో మరెన్నో రోగాలకు ఆహ్వానం పలికే ముఖద్వారం. శరీరంలో నిలువ ఉన్న ఎన్నో రుగ్మతలను మన మీద దాడికి పంపించే ఇంటిదొంగ. అయినా కంగారుపడాల్సినదేం లేదు. తొలిదశలోనే ఉంది కాబట్టి ఆహార, విహారాలను క్రమబద్ధం చేసుకోండి, తగ్గిపోతుంది. అప్పుడే కురుపు దానంతటదే నయమవుతుంది.''

రాజుగారి గుండెల్లో శతఘ్ని ప్రేలినట్టయింది.

మూడు కార్లుండీ తను మూడు కిలోమీటర్లు కాలినడక సాగించాల్సిందేనా! నవ రుచుల శాకపాకాలు కంటిముందుంచుకుని కాకరకాయ చేదు త్రాగాల్సిందేనా? ధూమపానం, మద్యపానం లాంటి తన ప్రియతమ నేస్తాలను దూరం చేసుకోవాల్సిందేనా??

మనిషిని ఇన్ని విధాలగానూ దోచుకునే ఈ దిక్కుమాలిన జబ్బుకి 'మధుమేహం' లేదా తీపిజబ్బు అని ఇంత కమ్మని పేరేమిటో!

డాక్టరు సలహాలన్నీ తు.చ. తప్పకుండా పాటించి నెల రోజుల తర్వాత పరీక్ష చేసుకుంటే షుగరు శాతం తగ్గింది గానీ, పూర్తిగా తొలగలేదు. జిహ్వాచాపల్యం మూలాన కక్కుర్తి పడితే ఎక్కడ దాగి ఉందోగానీ ఆ 'గడ్డ' దెబ్బతిన్న పాములా బుస్సున పడగ విప్పుతూ ప్రత్యక్షమవుతోంది.

''రోగం రట్టు-సంసారం గుట్టు'' అనే లౌకిక సూత్రం తెల్సిన సుందర్రాజుగారు తన కంపెనీలో పనిచేస్తున్న మధుమేహ పీడితులను పిల్చి వాళ్ళ అనుభవాలనూ, వైద్య విధానాలనూ ఆరాతీయడం మొదలెట్టారు. ఇప్పుడు వాళ్ళంతా తన ఆప్తమిత్రుల్లా అనిపిస్తోంది.

''మధుమేహంలో రెండు రకాలున్నాయి సార్. చిన్నప్పుడే అంకురించేది ప్రమాదకరమైనది. నలభై పై బడ్డాకా వచ్చేది ఏమంత కొంప ముంచేది కాదు. ఇది వంశానుగతంగా వచ్చే మామూలు జబ్బు. మీనాన్నగార్కి మధుమేహం ఉండేదా?'' ఎవరో అడిగారు.

ఉండేదో, లేదో తెలీదు. చాలీచాలని ఆదాయంతో తమ చదువులు, తిండీ-బట్టా, పెళ్ళిళ్ళూ-ఒడుగులూ, పురుళ్ళూ-పుణ్యాలు నెరవేర్చడాన్కి ఋణగ్రస్తుడిలా తండ్రి శ్రమించేవాడు. ఒంట్లో రోగమున్నా పరీక్ష చేయించుకునే తీరుబాటు వైద్యానికి డబ్బు విరజిమ్మే వెసులుబాటు తండ్రికి లేవు.

లేమితనం ఎంత భయంకరమైనదో తెల్సి పగబట్టినట్టు తను ఆర్థిక సూత్రాలను ఆకళించుకున్నాడు. డబ్బు గడించడాన్కి ఎన్ని వక్రమార్గాలున్నాయో అన్నిటినీ త్రొక్కాడు. అన్యాయం, అక్రమం, అవినీతి అనే పదాలు నీతి కథల్లోనే గానీ జీవితంలోనికి పనికిరావని తన 'శబ్దకోశం'లోంచి వాటిని తుడిచేసాడు. డబ్బున్న వితంతువు మెడలో మూడు ముళ్ళూ కట్టేసి మామగారి ఆస్థిని లుంగలా చుట్టేసుకున్నాడు. తన బుద్ధిబలంతో అంతకు పదింతలు చేసుకున్నాకగానీ జీవితపు పరుగుపందెంలో వెనుతిరిగి చూడనేలేదు. ఏభయ్యేళ్ళ వయస్సుకే అయిదారు కోట్ల ఆస్థిపరుడయ్యాడు.

ఏడువారాల నగలతో లక్ష్మీదేవిలా భార్య, స్టేట్స్‌లో ఎం.బి.ఏ చదివి ఈ మధ్యనే ఇండియాకు తిరిగొచ్చిన వివాహయోగ్యుడైన కుమారుడూ, డొనేషన్ కట్టకుండానే విశాఖపట్నంలో ఎం.బి.బి.ఎస్ చదువుతున్న అందమైన కుమార్తె, నాలుగైదు చిన్నా పెద్దా కంపెనీల్లో వాటాలు, ఇరవై ఎకరాలు బంగారం పండే మాగాణి భూములూ- ఇవి ఈకాల వ్యవధిలో సంభవించిన వరాలు. ఇంతకుమించిన మరెన్నో వరాలున్నా అవి నలుగురిలోనూ ఘనంగా చెప్పుకోదగ్గవి కావు.

మధుమేహాన్ని ఇంగ్లీషు మందులు బాగుచేయవన్నారు కొందరు. ఆయుర్వేదం మంచిదన్నారు ఇంకొందరు. హోమియోపతికి మించినది లేనే లేదన్నారు మరికొందరు.

ఏ వైద్యాన్ని ఎంచుకోవాలో తెలీక మీమాంసలో పడ్డారు రాజుగారు. ఈ విషయం కర్ణాకర్ణిగా తెల్సి ఇంటి తోటమాలి జోగులుగాడు ఉండబట్టలేకపోయాడు. తనకు తెల్సిన వైద్యాన్ని బాబుగార్కి విన్నవించుకున్నాడు.

''మందులెందుకుబాబయ్యా? నేల వేపచెట్టు ఆకులుగానీ నెలరోజులు తిన్నారంటే ఈ జబ్బు మరు జన్మకు కూడా రాదు.''

ఆమాట మంత్రంలా విన్పించింది సుందర్రాజుగారికి

''ఆ చెట్టు ఎక్కడుంటుందిరా?'' ఆత్రుతగా అడిగారు.

''సిన్నప్పుడు మా పల్లెపట్టుల్లో ఉండేది. సెరువుగట్లొడ్డున, ఏటి ఇసుకతిన్నెల ముళ్ళ తుప్పల నడుమ, కొండవాలులో-ఒక్కసోటేమిటి, ఎక్కడ పడితే అక్కడే దొరికేది. మన గంటస్తంబం కాడ వానపాముగారి కొట్లో దొరకచ్చు.''

సుందర్రాజుగారు కారిచ్చి ఆ దుకాణాన్కి మనిషిని పంపారు. వానపాముగారి కొట్లోనే కాదు, విజయనగరం మొత్తమ్మీద దొరకలేదు.

''ఈ మధ్య రావడం లేదు బాబూ. తమరు కావాలంటున్నారు కాబట్టి కొండోళ్ళకి కబురెడ్తాను. పార్వతీపురం కొండల్లో దొరుకుతుందేమో! వారం రోజులు ఆగి మరోసారి కబురుచేయండి'' అన్నాడు షావుకారు వినయంగా.

ఆగినా అది దొరుకుతుందో లేదోనన్న అనుమానం ఆయన్ను పీడించింది. ఆలస్యం భరించడాన్కి అతను సిద్ధంగా లేడు.

అందుకే, బంతిమొక్కల చిగుళ్ళను ట్రిమ్ చేస్తున్న జోగులుగాడి దగ్గరకు పరుగెత్తినంత ఇదిగా నడిచారు.

''ఒరేయ్ జోగులూ-ఆ మొక్కను చూస్తే గుర్తుపట్టగలవురా?''

జోగులు ఆయన కళ్ళలోకి చూసాడు. ఆలోచన పట్టేసినవాడిలా, ''గొడ్లు కాసుకుని పొలాల్లో తిరిగే చిన్నతనంలో ఆ సేదు మొక్క ఆకులు పందెం గట్టుకుని నమిలేవాళ్ళం బాబయ్యా. ఆట్నే మర్సిపోవడమేటి?'' అన్నాడు.

సుంద్రరాజుగారు బిరబిరా గ్యారేజ్‌లోంచి కారు బయటకుతీసారు.

''ఎక్కరా జోగులూ-''

''ఎక్కడికి బాబూ-?''

'' ఆ చెట్టు ఎక్కడ దొరుకుతుందో అక్కడకు. మీ పల్లె పొలాల్లోకి పోదాం-'' ఉన్న పళంగా జోగులుగాడ్ని కారెక్కించారు.

విజయనగరానికీ, పార్వతీపురానికీ మధ్యనున్న సందెమ్మకొండల మొదల్లో ఉంది వాడి గ్రామం.

దాదాపు పదేళ్ళ తర్వాత తన గ్రామానికి ప్రయాణం. వాడి మనస్సు అనిర్వచనీయమైన అనుభూతికి గురవుతోంది.

''ఎటు తిరగాలిరా?'' రెండోసారి విసుగ్గా అడిగారు రాజుగారు.

''వంతెన దాటినాక అమ్మోరి మర్రిసెట్టొస్తాది. దానికి కుడిసేతివంక...మట్టిరోడ్డ.'' అన్నాడు.

బ్రిడ్జివచ్చింది, దాటింది.

మర్రిచెట్టూ లేదు, మట్టి రోడ్డూలేదు.

''ఏది రా మర్రిచెట్టు?''

మర్రి చెట్టున్న చోట బస్సు షెల్టరుంది, ఎవరిదో దానం ఎవరి స్మృతిగానో. మట్టిరోడ్డు బదులు వగలుబోతున్న నాగిణిలా తార్రోడ్డు. మనస్సు ఎందుకో చివుక్కుమంది జోగులుగాడికి.

కుదుపులు లేకుండా పడవలా జారుతున్న కారు హుషారిచ్చింది.

''మన గ్రామాలు ఎంత గొప్పగావృద్ధి చెందుతున్నాయిరా! మూల మూలకీ తార్రోడ్డులు, గ్రామ గ్రామానికీ బస్సులు, ఎటుచూసినా కరెంట్ తీగలు, టెలిఫోన్ స్తంభాలు-

అబ్బ ఎంత మారిపోయిందిరా మనదేశం!''

మరో అయిదు కిలోమీటర్ల ప్రయాణం తర్వాత జోగులుగాడి పల్లెదర్శనమిచ్చింది. దాన్ని 'పల్లె' అనడం సభ్యతకాదన్నట్టు పేటపేటల్లోనూ డాబా ఇళ్ళు, కాఫీ హోటళ్ళూ, ప్రతి డాబా మీదనూ టి.వి. ఏంటెనాలు, ఫ్యాన్సీ దుకాణాలు, రెండు సినిమాహాళ్ళూ, రెండో మూడో ధాన్యం మరలు, పిండిమరలు, రోడ్లమీద పనీపాటా లేకుండా తిరిగే రంగేళీ రాజాలూ, పంజాబీ షేర్వాణీలు తొడుక్కున్న పల్లె పడుచులూ- ఒక మహా పట్టణానికి పుట్టిన పిల్ల పట్నంలా ఉంది.

ఒక చోట కారాపించాడు జోగులు.

''ఇక్కడే, ఆ సర్వేమొక్కల ఎనక్కి కొండవాగు ఉంది. దాని ఒడ్డున మేము గొడ్లు కాసుకునేటప్పుడు తుప్పలు తుప్పలు నేలవేప చెట్లుండేవి-''

సర్వేతోపు దాటి వాడి వెనుక నడిచారు రాజుగారు.

అక్కడ కొండవాగు కాదు కదా- కుళ్ళు కాలువ కూడా లేదు.


''ఏదిరా కొండవాగు?'' అసహనంగా అరిచారు.

దగ్గర్లోనే క్రికెట్టు ఆడుకుంటున్న కుర్రాళ్ళలో ఒకడ్ని వాకబు చేసాడు జోగులు.

''కొండ ఎగువ కాఫీ తోటలు పెంచుతున్నారు కదండీ రామరాజుగారు. ఆ వాగు ఇక క్రిందకు దిగడమేమిటి, అందులోనే ఇంకిపోతుందిగానీ-''

రామరాజు తనకు వేలు విడిచిన మేనల్లుడు. గర్వంగా మీసం త్రిప్పారు రాజుగారు.

నేల వేప మొక్క- గురించి పిచ్చివాడిలా వెతుకున్నాడు జోగులు.




ఎంతెంత దూరం నడుస్తున్నా పచ్చని ఆ మొక్క జాడ కన్పించడం లేదు. ఎక్కడికక్కడ సూర్యముఖి పూలతోటలూ, నిలువెత్తు ఆముదం మొక్కలూ తప్పించి- బచ్చలి, కంద, బీర, బెండ, తోటకూర లాటి కూరగాయల పాదులు లేనేలేవు. వాటిస్థానంలో ఈ పిచ్చి మొక్కలేమిటో అర్థంకాక జోగులుగాడు రాజుగార్ని అడిగాడు. చిద్విలాసంగా నవ్వి జవాబు చెప్పారు రాజుగారు.

''వీట్నే కమర్షియల్ క్రాప్స్ అంటార్లేరా! ఎన్ని కూరగాయపాదుల్ని పెంచితే రైతు ధనవంతుడౌతాడు? ఇవైతే, కాపుకాయడం లేటయినా- పెట్టిన మదుపుకి వందరెట్ల ఆదాయం. మన దేశపు రైతు తెలివిమీరుతున్నాడొరేయ్. జాతీయాదాన్ని పెంచుతున్నాడు. ఆ పువ్వుల గింజల్లోంచి నూనె తీస్తార్లేరా. అది ఒంటికి మంచిది.''

జోగులు గాడికి వెలితి వెలితిగా ఉంది.

ఈ చెట్ల గురించిన వెతుకులాటలో వాడికెన్నో వింతలు గోచరించాయి.

కంచారి చెరువు ఉండాల్సిన స్థానంలో ఎవరిదో సినిమాహాలుంది. గోర్జీలుండాల్సిన చోట ప్రైవేటు కాన్వెంటు స్కూలు, గ్రామ స్మశానం జాగాలో యూత్‌క్లబ్బు వెలిసాయి. కట్టుతప్పిన ఆడదానిలా దర్శనమిచ్చింది తనగ్రామం.

ప్రొద్దుటెప్పుడో తిన్న చద్దన్నం- కడుపులో కరకరలాడ్తోంది ఆకలి.

మొక్కల వెతుకులాటలో సూరీడు నడినెత్తికొచ్చిన సంగతి గుర్తించనే లేదు. వాడి వెనుకనే నడుస్తున్న రాజుగార్కి- ఇక శక్తిలేక ఆగిపోయారు.

''వెధవన్నర వెధవాని- అటువంటి దివ్యౌషధాల మొక్క- మాసానని నువ్వు చెప్పడమూ, నమ్మి నేను నీ వెనుక రావడమూ ఒకేలా ఉన్నాయి. పది లీటర్ల పెట్రోలు తగులబడిపోయింది. తిండీ తిప్పలు లేకుండా ఈ గట్లమ్మట తిరిగే దరిద్రం పట్టింది...'' విలవిల లాడారు రాజుగారు.

అలా ఎంత దూరం వెళ్ళారో ఏమో, కొండవాలు దగ్గరగా కన్పిస్తోంది. పనివాళ్ళను అదలిస్తున్న పెత్తందారీ కేకలు విన్పిస్తున్నాయి.

''మళ్ళీ ఇంత దూరమూ వెనక్కు వెళ్ళేదెలారా?'' కారు ఉక్కపిడతలా కన్పిస్తుండగా నీరసం ముంచుకొస్తోంది రాజుగార్కి.

''బాబుగారూ- దొరికిందండీ'' జోగులుగాడి కళ్ళు మెరుస్తున్నాయి. సంతోషం పట్టలేక వెర్రికేక వేసాడు.

''ఎక్కడరా, ఎక్కడరా-'' అంటూ వాడున్న మెట్టవంక పరుగులు తీసారు రాజుగారు.

కాఫీతోటల్లోంచి దయతో విదిల్చిన అంగుళం వెడల్పు నీటి కాలువకు ఒకవైపు, గుబురుగుబురుగా పెరిగిన రెల్లు తుప్పల మధ్య చావుతో సమరం చేస్తున్నట్టు బలహీనమైన మొక్క కనిపించింది. దానికో పదో, పదిహేనో ఆకులు ఉన్నాయి. నాగరికత తరిమితే కొండల్లో తలదాచుకున్న విప్లవవీరుడిలా ఉంది.

అతికష్టం మీద వేళ్ళతో సహా దాన్ని పెకిలించాడు జోగులు.


కార్లోంచి తెచ్చిన న్యూస్‌పేపర్‌తో, దాన్ని పకోడీ పొట్లంలా చుట్టి, మట్టి నింపి ఆ చెట్టుని పదిలంగా ప్రతిష్ఠించారు రాజుగారు.

''నా పాలిటి ఇది అమృతవల్లిరా జోగులూ- దీన్ని మన తోట బంగాళాలో పెంచి తీపి జబ్బుకు చేదు మందుస్వంతం చేసుకుంటాను.'' అన్నారు పిచ్చిగా.

ఎండలో పడి తిరిగిన నీరసాన్ని మరచిపోయి అలాటి మొక్కల కోసం వెతికారు.

గంపెడు మొక్కలు దొరికాయి.

అవి పెరిగే పరిసరాలను నిశితంగా గమనించారు రాజుగారు. వాటికి కావలసిన పరిస్థితులేవో చూచాయిగా తెల్సిపోయాయి. గుప్పెడు గుండెను అదిమి పెట్టలేని సంతోషం గుప్పున పైకెగసి




వస్తోంది. అంతదూరమూ నడిచి కారున్న చోటికి వచ్చారు.

కారు తార్రోడ్డు మీద పరుగులు తీస్తోంది. పెద్ద రోడ్డు వంక, పల్లెల్లోంచి పట్టణానికి తరుమబడ్డ జోగులు గాడిలానే.

జోగులుగాడి మనసు కకావికలమయింది. తన 'పల్లె' పల్లెతనాన్ని కోల్పోయినందుకు. సుందర్రాజుగారి మనసు క్రొత్తగా రెక్కలొచ్చిన పక్షిలా భవిష్యత్తులోకి పరుగులు తీస్తోంది.

కొండ ఈ వైపు వాలు ఇంటి మొక్కల పెంపకానికి అనుగుణంగా ఉంది. మేనల్లుడి కాఫీ తోటకు ఇటువైపు ఆ కొండ వాలును గవర్నమెంటు నుండి లీజుకు తీసుకుని, ఆ ప్రదేశంలో ఈ మొక్కల్నీ, ఇలాంటి ఔషధీగుణాలున్న మరెన్నో మొక్కల్నీ పెంచీ- రంగు రంగుల ప్యాకెట్లలో నింపి, టెలివిజన్‌లోనూ- పత్రికలలోనూ వాణిజ్య ప్రకటనలు గుప్పించీ-

ఎంబిఏ ప్యాసయివచ్చిన కొడుకుని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఒక బృహత్తరమైన కంపెనీ రూపొందించీ, విపణ వీధుల్లో షేర్లు, పబ్లిక్ ఇష్యూలు విడుదల చేస్తే- ఓహ్!!

ఢోకాలేని వ్యాపారం

అడవులన్నీ ఆ చెట్లతోనే నిండినట్టూ, చెట్టు చెట్టుకీ ఆకుల బదులు రూపాయి కాగితాలే మొలుస్తున్నట్టూ రాజుగారికి అన్పిస్తోంది.

తన భావాలను దాచుకునే మనిషి కాకపోవడం చేత, తన పథకాలనూ- అవి సాధించబోయే ఆర్థిక ప్రయోజనాలనూ నిర్విరామంగా వాగుతూనే ఉన్నారు కారు నడుపుతూనే.

## ఇబ్బంది



**గతంలో దివ్యభారతి, విజయశాంతిని బెదిరించి, జయంతిని కొట్టిన మోహన్ బాబు తిరిగి ఇప్పుడు మరో హీరోయిన్‌ని బెదిరించి నటింపచేశాడా? 'కలెక్టర్‌గారు' చిత్రంలో సాక్షి శివానంద్‌ని నటింపజేసేందుకు వెళ్లిన మోహన్ బాబు అప్పటికే 'నిధి', 'మాస్టర్' చిత్రాలతో బిజీగా వుండడంతో కాల్షీట్స్ అడ్జస్ట్ కావని చెప్పిందట. దాంతో ఆవేశపరుడైన మోహన్‌బాబు 'అలాగా! అయితే నువ్వు తెలుగు పరిశ్రమలో ఎలా నెగ్గుకొస్తావో చూస్తాను' అంటూ బెదిరించాడని ఓ ప్రముఖ ఆంగ్ల సినీ పత్రిక కథనం. ఈ విషయమై మరో ప్రముఖ ఆంగ్ల సినీ పత్రిక సాక్షి శివానంద్‌ని ప్రశ్నిస్తే 'అదేం లేదు. ఇది కేవలం పుకారు' అంటూ నవ్వేసింది. ఆ నవ్వులో ఏదో ఇబ్బంది కనిపించిందని ఆ రెండో పత్రిక విలేకరి అంటున్నాడు.**

-జె.వి.బాబు

జోగులు గాడికి ఒళ్ళంతా మంటగా అనిపిస్తోంది.

వాడి కొడుకులకు ఒంటిని కప్పే సరైన దుస్తులు లేవు.

రేపు రంగుల కల కాదు- చిల్లుల వల.

బ్రతుక్కీ, చావుకీ సమయం ప్రతి ఉదయమూ.

ఆ మధ్య గంట స్తంబం దగ్గర హరికథ విన్నప్పుడు హరిదాసు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఎవడో రాక్షసుడు, వాడి రక్తం చిమ్మినచోట అలాంటి బలవంతులైన రాక్షసులు మరెందరో పుట్టుకొస్తారట. అంచేత, రక్తం చిమ్మకుండా వాడ్ని అంతం చేయడం దేవతలకు సమస్యగా నిల్చిందట. వాడిని వాళ్ళెలా చంపారో వినలేదు జోగులుగాడు.

అది ఎప్పుడూ చిక్కుముడిలా ఉండిపోయింది. కానీ, ఈరోజు యజమానిలో అలాటి రాక్షసుడు కన్పించాడు వాడికి.

వాడి మనస్సులో విస్ఫోటం. రగులుకున్న అగ్నిమంటల్లోంచి ఏదో పరిష్కారం.

కారు వెళ్తున్న త్రోవలో బ్రిడ్జి వచ్చింది.

''ఆపండి బాబూ- ఒక్క క్షణం'' అరిచాడు.

''ఏమిట్రా- ఒంటేలు వెడతావేమిటి?'' విసుగ్గా కారాపారు రాజుగారు.

చేతితో గంపతో, గంపనిండా తను పెరికిన మొక్కల్తో కారుదిగాడు జోగులు.

వంతెన దిగువ ఉరకలు వేస్తూ ప్రవహిస్తున్న నదీజలం.

పైనున్న ఆకాశానికీ, క్రిందున్న నదికీ మనస్సులోనే నమస్కరించాడు.

తర్వాత-

ధభీమని గంపతో సహా ఆ మొక్కల్ని నదిలోకి విసిరేసాడు బలంగా.

''ఒరేయ్, ఒరేయ్- ఏమిట్రా ఇది? ఏమిట్రా నువ్వు చేసిన పని?'' అంటూ కారు దిగి మీదికి వస్తున్నారు రాజుగారు.

''ఆ మొక్కల్ని ఎక్కడ పెరగాలో అక్కడే పెరగనీయండి బాబయ్యా! ఆటితోనూ యాపారం సేద్దామనుకుంటే సెట్లూ, సేమలూ మడిసి మీద తిరగబడే రోజులొచ్చేతాయి''- అన్నాడు ఏడుపో, హెచ్చరికో తెలియని గద్గద స్వరంతో.

మునుగుతూ, తేలుతూ తలా ఓదిక్కూ కొట్టుకుపోతున్నాయి మొక్కలు. ★